క్లుప్తంగా

సచివాలయం పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్దిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు అంబేడ్కర్ కాలనీ వద్ద నూతనంగా నిర్మిస్తున్న సచివాలయం నిర్మాణ పనులను కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ గురువారం పరిశీలించారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.19.45 లక్షల వ్యయంతో శంకుస్థాపన చేసిన పనులు ప్రస్తుతం జరుగుతుండడంతో ఆయన పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఇంజినీరింగ్ విభాగం ఏఈ రత్నాకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్, పార్టీ నాయకుడు శ్యామ్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

వీఆర్‌వో వర్మ మృతి



వీఆర్‌వో వర్మ (ఫైల్)

సీతమ్మధార : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోగా పనిచేస్తున్న దంతులూరి అనంత ఆదిత్య వర్మ (56) మరణించారు. ఆయన అనారోగ్యం కారణంగా కొంతకాలంగా ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మరణించారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన రెండేళ్లుగా కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్నారు. సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయంలో 2019 జూలై నుంచి పనిచేస్తున్నారు. ఆయన కోవిడ్ సమయంలో ప్రజలకు విశేష సేవలు అందించారని సిబ్బంది గుర్తు చేస్తున్నారు. హెచ్‌బీ కాలనీలోని నివాసం నుంచి అంతిమయాత్ర అనంతరం ఎంవీపీ కాలనీలో గల శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. అంతిమయాత్రలో తహసీల్దార్ ఎం.రమేష్, డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, ఇతర సిబ్బంది, సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉత్తర నియోజకవర్గం అభివృద్ధికి కృషి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, తదితరులు

సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అన్నారు. జీవీఎంసీ 24వ వార్డు సత్యం జంక్షన్ జాతీయ రహదారిపై మూడు చోట్ల గ్రీన్ బెల్ట్ అభివృద్ధిలో భాగంగా కంచె నిర్మాణ పనులకు ఆయన గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ సాడి పద్మారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ ప్రజలు చెల్లించే పన్నులు ఇకపై స్థానికుల అవసరాల కోసం చేపట్టే పనులకు వినియోగించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. జీవీఎంసీ కేటాయించిన నిధులతో కంచె నిర్మాణ పనులు చేపట్టామని వివరించారు. ఈ అభివృద్ధి పనులకు సుమారు రూ.60 లక్షలు ఖర్చు చేయనున్నారన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్, శ్యామలాదీపిక, బర్ల పద్మలత, గొంప ధర్మారావు, ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తాటిచెట్లపాలెం : అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో చేపడుతున్న చెట్ల కొమ్మల తొలగింపు, హెచ్‌టీ లైన్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్ – 1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. అబిద్‌నగర్, వేణుగోపాలస్వామి గుడి ఏరియా, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డు, శాంతినగర్, కైలాసపురం మెయిన్ రోడ్, సంజీవయ్యకాలనీలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

టార్గెట్ 100%



పదింతల శ్రద్ధతో బోధన



తరగతులను పర్యవేక్షిస్తున్న టీచర్

- మాధవధార, కె.కాలనీ హైస్కూళ్ల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- మంచి ఫలితాల కోసం ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణ



మాధవధార విద్యార్థుల ప్రగతికి సంబంధించిన బ్రోచర్

మురళీనగర్ : విద్యార్థి జీవితంలో పదో తరగతి చాలా కీలకం. ఇక్కడి నుంచే విద్యార్థి ఉన్నత విద్యాభ్యాసం ప్రారంభమవుతుంది. తమ పిల్లాడు పదో తరగతి దాటేస్తే చాలు ఎలాగైనా బతికేస్తాడు అని పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు కల కంటారు. విద్యార్థి పదో తరగతి తర్వాత తమకిష్టమైన కోర్సు చదవాలంటే పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలి. అత్యధిక మార్కుల సాధన విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. అందుకే పదిలో తమ ప్రతిభ చాటేందుకు విద్యార్థులు ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం పాఠశాలల యాజమాన్యాలు కూడా తమ వంతుగా విద్యార్థులను సన్నద్ధం చేయడంలో నిమగ్నమయ్యాయి. మురళీనగర్ పరిసరాల్లోని రెండు జీవీఎంసీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతిలో నూటికి నూరు శాతం ఫలితాల సాధన దిశగా కసరత్తు చేస్తున్నారు. గత ఫలితాలు ఎట్టి పరిస్థితిలో తగ్గకుండా నూరు శాతం ఫలితాల సాధనకు చర్యలు తీసుకుంటున్నారు.

రెండు హైస్కూళ్లు.. 254 మంది విద్యార్థులు

మురళీనగర్ పరిసరాల్లో రెండు జీవీఎంసీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో మాధవధార ఉన్నత పాఠశాలలో 155 మంది, అల్లూరి సీతారామరాజు



అల్లూరి సీతారామరాజునగర్‌లోని కె.కాలనీ ఉన్నత పాఠశాల

నగర్‌లోని కె.కాలనీ ఉన్నత పాఠశాలలో 99 మంది కలిపి మొత్తం 254 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఈ పాఠశాలల్లో ఈ సారి నూరు శాతం ఫలితాల సాధనకు అధికారులు చర్యలు తీసుకున్నారు. గత ఏడాది మాధవధార ఉన్నత పాఠశాల నుంచి 154 మంది పరీక్షలకు హాజరు కాగా 134 మంది ఉత్తీర్ణులై 87 శాతం ఫలితాలు సాధించారు. వీరిలో 28 మంది 500 పైన మార్కులు సాధించి జీవీఎంసీ పరిధిలో మొదటి స్థానం సాధించారు. వీరిలో 19 మంది బాలికలే కావడం గమనార్హం. ఈ పాఠశాలకు చెందిన జి.తేజేష్ రెడ్డి అత్యధికంగా 594 మార్కులు సాధించి రికార్డు సృష్టించాడు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటుకు ఏమాత్రం తీసిపోవని నిరూపించారు. ఈ ఏడాది పరీక్షలకు సిద్ధమవుతున్న 155 మందిలో 70 మంది బాలురు, 85 మంది బాలికలు ఉన్నారు.

- అల్లూరి సీతారామరాజు నగర్‌లోని కె.కాలనీ ఉన్నత పాఠశాల నుంచి గత ఏడాది 109 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 93 మంది ఉత్తీర్ణులై 86 శాతం ఫలితాలు సాధించారు. 30 మంది 500లకు పైగా, ముగ్గురు విద్యార్థులు 550కిపైగా మార్కులు సాధించారు. అత్యధికంగా 573 మార్కులు బొడ్డేడ నవ్య సాధించింది. ఈ సంవత్సరం 99 మందిలో బాలురు 45 మంది, బాలికలు 54 మంది పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

గ్రేడ్‌లుగా విభజించి ప్రత్యేక తరగతులు

జిల్లా విద్యాశాఖ రూపొందించిన వంద రోజుల ప్రణాళికను ఈ రెండు హైస్కూళ్లలో పక్కాగా అమలు చేస్తున్నారు. విద్యార్థులను ఏబీసీడీ గ్రేడులుగా విభజించి తరగతుల్లో ప్రత్యేక సాధన చేయిస్తున్నారు. మాధవధర ఉన్నత పాఠశాలలో 34 మంది, కె.కాలనీ ఉన్నత పాఠశాలలో 10 మందిని ఏ – ప్లస్ గ్రేడు విద్యార్థులుగా గుర్తించారు. వీరందరూ 500 మార్కులు దాటేందుకు అవసరమైన మెటీరియల్ అందించారు. సీ, డీ గ్రేడులపై ప్రత్యే శ్రద్ధ పెట్టి వారు ఉత్తీర్ణులయ్యే విధంగా చర్యలు తీసుకున్నారు. ఎస్‌సీఈఆర్టీ సరఫరా చేసిన ప్రశ్నలతో కూడిన క్వశ్చన్ బ్యాంకు ఇచ్చారు. వీటికి జవాబులు ఉపాధ్యాయులు తయారు చేసి మెటీరియల్‌గా రూపొందించి అందించారు. రోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ఆదివారాలు, పబ్లిక్ హాలిడేస్‌లలో కూడా తరగతులు నిర్వహిస్తున్నారు.

స్టడీ అవర్లతో పర్యవేక్షణ

ఈ రెండు హైస్కూళ్లలో డిసెంబరు నెలాఖరుకి సిలబస్ పూర్తికావడంతోపాటు జనవరి 31 నాటికి రివిజన్ పూర్తవుతుంది. దీంతో రోజూ ఉదయం స్టడీ అవర్, మధ్యాహ్నం పరీక్షలు నిర్వహిస్తున్నారు. డీసీఈబీ ఇచ్చిన పేపర్లతో ప్రతీ వారం పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఫార్మేటివ్ – 3 పరీక్షలు ఈ నెల 28 నుంచి 31 వరకు నిర్వహిస్తారు. ప్రీఫైనల్ పరీక్షలు ఫిబ్రవరి 12 నుంచి 20 వరకు, గ్రాండ్ టెస్ట్ మార్చి 3 నుంచి **8 వరకు**, ఫైనల్ పబ్లిక్ పరీక్షలు మార్చి 17 నుంచి 31 వరకు నిర్వహిస్తారు.



కె.కాలనీ ఉన్నత పాఠశాలలో అధ్యయన తరగతుల్లో విద్యార్థులు

వెనుకబడిన విద్యార్థుల దత్తత

ప్రతీ ఉపాధ్యాయుడు విద్యార్థులను దత్తత తీసుకుని వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారు. వారి రోజు వారీ ప్రగతి ఆధారంగా ఉపాధ్యాయులు ప్రత్యేక సాధన చేయిస్తున్నారు. నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. గత ఏడాది సాధించిన రికార్డు ఫలితాలు నిలబెట్టుకోవడమే కాకుండా ఈ సారి వంద శాతం ఫలితాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

– బి.హేమలత, హెచ్‌ఎం, మాధవధార హైస్కూల్

500 దాటితో ప్రోత్సాహకాలు

విద్యార్థుల తల్లిదండ్రులతో ఇప్పటికే సమావేశం నిర్వహించారు. ఎప్పటికప్పుడు వారి పిల్లల ప్రోగ్రెస్ తెలియజేస్తున్నాం. విద్యార్థులు పరీక్షల్లో రాసిన పేపర్లు దిద్దిన తర్వాత ఇంటికి పంపించి తల్లిదండ్రుల సంతకాలు తీసుకుంటున్నాం. సెల్ ఫోన్లు, టీవీలకు పిల్లలను దూరంగా ఉంచాలని సూచించాం. 500 మార్కులు దాటిన వారికి నగదు ప్రోత్సాహకాలు ప్రకటించాం.

– ఎన్.నాగ మీన సాయిలక్ష్మి, హెచ్‌ఎం, కె.కాలనీ హైస్కూల్

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

సీతమ్మధార : పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంపీ ఎం.శ్రీభరత్ సూచించారు. పీఅండ్ టీ కాలనీలో గల ఎన్ఎంసీ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. రానున్న పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవుతున్నారో ఆరా తీశారు. పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, వెల్లంకి భరత్, గొంప ధర్మారావు, బర్ల బాలకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.రామ్ ప్రసాద్, చిన్న భరత్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా తిరంగా ర్యాలీ



తిరంగ ర్యాలీ నిర్వహిస్తున్న బుల్లయ్య కళాశాల విద్యార్థులు

సీతంపేట : లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులు తిరంగ ర్యాలీ గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. 75వ రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా 75 అడుగుల మువ్వన్నెల జెండాతో కళాశాల అధ్యాపక సిబ్బంది, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ క్యాడెట్లు పాల్గొని సుమారు 4.2 కిలో మీటర్లు ర్యాలీ నిర్వహించారు. కళాశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ వీఐపీ రోడ్, ఆశీలుమెట్ట జంక్షన్, జీవీఎంసీ గాంధీ విగ్రహం, రామాటాకీస్ మీదుగా కళాశాలకు చేరుకుంది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

యూజీడీ లీకుతో అవస్థలు





ఎన్జీజీవోస్ కాలనీలో లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్స్

సీతంపేట : జీవీఎంసీ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలో 49 – 38 – 1 ఇంటి నంబరు నుంచి 49 – 38 – 9 బాలాజీ రెసిడెన్సీ మధ్య గల యూజీడీ మ్యాన్‌హోల్స్ తరచూ లీకవుతూ మురుగు నీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా తాత్కాలిక చర్యలు చేపడుతున్నారు తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం రాజీనామాలు చేయాల్సింది ఉద్యోగులు కాదని.. కూటమి నాయకులని సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, కార్యదర్శి బి.జగన్ పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 1400 రోజుల నుంచి కార్మికులు, ప్రజలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున పోరాడుతున్నట్లు తెలిపారు. ఈ పోరాట ఫలితంగానే స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం ఒక్క శాతం కూడా ప్రైవేట్‌పరం చేయలేకపోయిందన్నారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులు ఏ రోజు తమకు ప్యాకేజీ కావాలని కోరలేదన్నారు. బీజేపీ నాయకులు పనిగట్టుకుని స్టీల్‌ప్లాంట్ కార్మికులు చేస్తున్న పోరాటాన్ని అవహేళన చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ మాట్లాడుతూ ఈ ప్యాకేజీ సరిపోకపోతే ఉద్యోగులు రాజీనామాలు చేసి వెళ్లిపోవాలనడం దుర్మార్గం అన్నారు. ప్రజా పోరాటాలను అవహేళన చేసిన వారు చరిత్ర హీనులుగా మిగిలిపోతారన్నారు. ఇప్పటికై నా బీజేపీ, కూటమి నాయకులకు చిత్తశుద్ధి ఉంటే స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలన్నారు. కార్మికులను, పోరాటాలను అవహేళన చేసే ప్రకటనలు మానుకోవాలని డిమాండ్ చేశారు.

ఉక్కు పరిరక్షణ పోరాటంలో ఉద్యోగుల వెంట ఉంటా

ఉక్కునగరం : విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటంలో తాను ఉద్యోగుల వెంటే ఉంటానని జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం సాయంత్రం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన యువ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీతో ఈ సమస్య పరిష్కారం కాదన్నారు. సొంత గనులు కేటాయించడం తప్ప మరొక మార్గం లేదన్నారు. అలాకాని పక్షంలో ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తే ముడి ఖనిజం ఖర్చులు బాగా తగ్గి లాభాల బాట పడుతుందన్నారు. ఈ పరిశ్రమ విలువ పెరగాలంటే భూములను పరిశ్రమ పేరిట బదలాయించాలన్నారు. అంత వరకు టాక్స్ హాలిడే ఇస్తే వడ్డీల భారం తగ్గి కర్మాగారం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించాలని సూచించారు. ఇందుకోసం కార్మిక వర్గం పెద్ద ఎత్తున ఐక్య ఉద్యమాలతో ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఆ ఉద్యమంలో తాను కూడా ఉద్యోగుల వెంట ఉంటానన్నారు. కార్యక్రమంలో స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.టి.దాస్, యు.రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ లక్ష్మీనారాయణ

పార్కు అభివృద్ధికి వినతి

సీతమ్మధార : తెన్నేటినగర్ పార్కులో పిల్లల ఆట సామగ్రి, పెయింటింగ్స్, విద్యుత్ అలంకరణ, ఇతర అభివృద్ధి పనులు చేయాలని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకి స్థానికులు గురువారం వినతిపత్రం అందించారు. కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ససపల వరప్రసాద్, నంబాల ఈశ్వరరావు, తదితరులు ఎమ్మెల్యేని కలిశారు.

దివ్యాంగులకు అన్న సమారాధన

సీతంపేట : కుర్తాళం శంకరాచార్యులు, శ్రీలలితాపీఠం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి 89వ అవతరణోత్సవం సందర్భంగా అక్కయ్యపాలెంలో గల పావని దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు గురువారం మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



సినిమా పాటలు పాడుతున్న గాయకులు

సీతంపేట : ఘంటసాల సుమధుర స్వరాలు సంగీత సంస్థ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి అలరించింది. గాయనీ గాయకులు నరసింహమూర్తి, పెమ్మరాజు, సాంబశివరావు, కె.ఎల్.రావు, నాగేశ్వరరావు, రామ నరసింహం, ఆంజనేయరెడ్డి, జిలాని, సి.వి.రాజేశ్వరి, భాగ్యలక్ష్మి, ఎస్.రాజేశ్వరి, పి.సత్యవతి, గంటి ఉష సోలో, యుగళ గీతాలతో ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమంలో సన్ మూర్తి, కట్టా మల్లేశ్వర రావు, ఎస్.రాజేశ్వరి, పి.బి.ఖాన్ పాల్గొన్నారు.

బాలికలకు పౌష్టికాహారం అందించాలి

సీతమ్మధార : బాలికలకు తగినంత పౌష్టికాహారం అందేలా చూడాలని జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జయదేవి సూచించారు. చినగదిలి మండలం అంగన్‌వాడీ సిబ్బందికి, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, స్కూల్ నోడల్ టీచర్లు, విద్యా కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బందికి కిశోరీ బాలికల సంరక్షణపై రేసపువానిపాలెంలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోరీ బాలికలు రక్తహీనతకు గురికాకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా తగినంత పౌష్టికాహారం అందజేస్తున్నామని గుర్తు చేశారు. కౌమార దశ పిల్లల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. బాల్య వివాహాలు జరగకుండా విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఈ నెల 24న జాతీయ బాలికా దినోత్సవాన్ని పండగలా నిర్వహించాలని సూచించారు. సీడీపీవో ఎం.వి.



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ జయదేవి

రమణ కుమారి మాట్లాడుతూ కౌమార దశ అనేది చాలా క్లిష్టమైందన్నారు. మెడికల్ ఆఫీసర్ మన్మోహన్, అప్ హోల్డ్ ఎన్జీవో జిల్లా కో ఆర్డినేటర్ డేవిడ్ రాజ్ వివిధ చట్టాలపై వివరించారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనకు నడుము బిగిద్దాం పేరిట ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏసీడీపీవో శ్రీలత, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిరస్మరణీయుడు



సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు



నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విశ్వనాథం, విద్యార్థులు



నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, బీజేపీ నాయకులు

మురళీనగర్ : మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వనితా భవన్‌లో స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ముందుగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్లబ్ అధ్యక్షురాలు పొందూరు ప్రభావతి, ఎం.జయ, కె.భానుమతి, జి.శిరీషలత, ఎం.ప్రమీలరావు, సీహెచ్.పద్మావతి పాల్గొన్నారు.

సీతంపేట : అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌లో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను 'కర్తవ్య బోధా దివస్' పేరిట నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పాఠశాల ఎన్‌సీసీ అధికారి ఎం.ఎస్.వి.విశ్వనాథం పూలమలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతాజీ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. హ్యూమన్ రైట్స్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.ఎం.నాయుడు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌ను సందర్శించారు. 10వ తరగతి విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీ నరస, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంచరపాలెం : స్థానిక కంచరపాలెం నేతాజీ వంతెన రహదారిలో గురువారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ 55, 56వ వార్డుల అధ్యక్షులు కాయిత రత్నాకర్, ఆడారి శ్రీను పాల్గొని చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శివప్రసాద్‌రెడ్డి, దాస్, శంకరరావు, రమణబాబు పాల్గొన్నారు.

సీతమ్మధార : దివంగత స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ చిరస్మరణీయుడని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అన్నారు. ఈ మేరకు సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్సన్‌లోని బీజేపీ కార్యాలయంలో నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

